WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 363 సోమవారం 18-5-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## నా బూత్ నా బాధ్యత'

### క్యాడర్‌లో జోష్.. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన కేటీఆర్ ప్రసంగం



హైదరాబాద్, **నవతరం**

నా బూత్ నా బాధ్యత' పేరుతో బీఆర్ఎస్ బూత్ స్థాయి నాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం పండుగలా సాగింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో హస్తినాపురం జీఎస్సార్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అన్ని డివిజన్‌ల నుంచి బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం సాయంత్రం 4 గంటల వరకు సాగింది. నాయకులు కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో చివరి వరకు వక్తల ప్రసంగాలు విని రెట్టించిన ఉత్సాహంతో తిరిగి వెళ్లారు. ఆద్యంతం జై తెలంగాణ నినాదాలతో జీఎస్సార్ గార్డెన్స్ మార్మోగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం



## భగీరథ్ ఫోన్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు

- విచారణ ఖైదీలు ఉండే బ్యారక్ కేటాయింపు
- ప్రత్యేక సౌకర్యాలేవీ లేవన్న జైలు అధికారులునిరాకరణ
- పాలు, బ్రెడ్డుతో సరిపెట్టుకున్న తీరు!

ఆదివారం కావడంతో ములాఖత్‌లోనూ ఎవరూ కలవడానికి రాలేదన్న జైలు సిబ్బంది

- బాధితురాలి తల్లి ఇచ్చిన ఆధారాలు కూడా..
- పది రోజులు కస్టడీ కోరనున్న పోలీసులు
- బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్న నేపథ్యంలో..బండి సంజయ్ వాంగ్మూలం తీసుకునే చాన్స్!

మిగతా 2లో


## రాష్ట్రంలో పొగాకు రైతుల సమస్యలపై లేక

- పొగాకుపై పన్నుల విధానాన్ని పునఃసమీక్షించండి
- ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకోండి
- కేంద్ర మంత్రులు నిర్మల, సీఎం చంద్రబాబు లేఖ



2లో

## ఎప్‌సెట్-2026 ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తా



2లో

టీ-ఎప్‌సెట్‌లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులు

ఇంజనీరింగ్‌లో 3, 4, 6, 7, 9 ర్యాంకులు కైవసం

శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



2లో

## "ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) చేపట్టేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే..

- సర్'కు మతం రంగు పులుముతారా?
- ఉద్యోగులపై ఒక వర్గాన్ని రెచ్చగొడతారా?
- హైదరాబాద్‌లో రోహింగ్యాల ఓట్లు తొలగించద్దా?:

## భారతీ య సంస్కృతిని చాటి చెప్పేది డప్పు కళాకారులే

- బీజేపీతోనే డప్పు కళాకారులకు న్యాయం
- 40 ఏళ్లు దాటిన వారికి పింఛన్.. ఇంటి స్థలం ఇస్తాం
- మంత్రి సత్యకుమార్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్
- విజయవాడలో భారీ ర్యాలీ..



విజయవాడ,**నవతరం**


భారతీయ సంస్కృతిని చాటి చెప్పేది డప్పు కళాకారులేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీస్టేడియం నుంచి అంబేద్కర్ స్మృతివనం వరకు డప్పు కళాకారులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్మృతివనంలో జరిగిన సభలో మంత్రి మా ట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. అంబేద్కర్ రెండుసార్లు ఎంపీగా పోటీ చేస్తే అప్పటి ప్రధాని నెహ్రూ ఓడించారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్.. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. బీజేపీ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు ఇస్తామన్నారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడమంటే ఆయన విగ్రహానికి దండలు వేయడం మాత్రమే కాదన్నారు. కూటమి ప్రభుత్వం డప్పు కళాకారులను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. 40 ఏళ్లు దాటిన డప్పు కళాకారులకు పెన్షన్‌తో పాటు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి పంచాయతీలో డప్పు కళాకారుడికి ఒక ఉద్యోగం ఇవ్వాలని ప్రతిపాదిస్తామన్నారు. దేవాలయ వ్యవస్థలో డప్పు, సన్నాయి పెట్టేలా చూస్తామన్నారు. బాగా చదువుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. డప్పు కళాకారులు బీజేపీతో కలిసి నడిస్తే వారి జీవితాలను మారుస్తామని మాధవ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బూమ్‌తో ప్రపంచమంతా సెమీకండక్టర్లు

### టాటా-డచ్ సంస్థల భాగస్వామ్యంతో గుజరాత్‌లో భారీ కంపెనీ

### డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు.. 17 ఒప్పందాలు

### నెదర్లాండ్స్ పర్యటన ముగించుకొని స్వీడన్ చేరుకున్న భారత ప్రధాని



డిల్లీ, **నవతరం**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బూమ్‌తో ప్రపంచమంతా సెమీకండక్టర్లు, చిప్‌లకు కొరత ఏర్పడిన నేపథ్యంలో భారత్‌లో సెమీకండక్టర్ల పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందించేందుకు నెదర్లాండ్స్ ముందుకొచ్చింది. భారత పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్, నెదర్లాండ్స్ కంపెనీ ఏఎస్ఎంఎల్ సంయుక్తంగా గుజరాత్‌లోని ధోలేరాలో భారీ సెమీకండక్టర్ కంపెనీని నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. నాలుగు దేశాల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. శనివారం సాయంత్రం (స్థానిక కాలమానం) నెదర్లాండ్స్‌లో ఆ దేశ ప్రధాని ప్రధాని రాబ్ జెట్టెన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇద్దరు ప్రధానుల సమక్షంలో ఈ రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. మొత్తంగా రెండు దేశాల మధ్య వివిధ రంగాల్లో 17 ఒప్పందాలు కుదిరాయి. రక్షణ, క్రిటికల్ మినరల్స్, శాస్త్రసాంకేతిక రంగం, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ, వాతావరణ మార్పులు, ఇంధనం, సముద్ర రవాణా, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో పరస్పరం సహకారం అందించుకోవాలని నిర్ణయించారు. చర్చల అనంతరం ఇద్దరు ప్రధానులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ సంక్షేమం దృష్ట్యా హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరిచి వాణిజ్య నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని, ఉక్రెయిన్, రష్యాలు వెంటనే యుద్ధాన్ని ఆపేసి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా-ఇరాన్ యుద్ధ వల్ల పశ్చిమాసియాలో ఏర్పడిన కల్లోల పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేశారు. ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం నెదర్లాండ్స్ మద్దతు ప్రకటించింది. 'నెదర్లాండ్స్‌లో నా పర్యటన రెండు దేశాల

మిగతా 2లో

## తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ట్విట్టర్ రాజకీయాలు చేయడం వైసీపీ నేతలకు అలవాటైంద

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి(విజయవాడ),**నవతరం**

తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ట్విట్టర్ రాజకీయాలు చేయడం వైసీపీ నేతలకు అలవాటైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. విజయవాడ శివారు గొల్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఐసీయూలో పెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిస్తుంటే వాస్తవాలను అంగీకరించే పరిస్థితిలో ఆ పార్టీ లేదని విమర్శించారు. కేవలం 23 నెలల్లోనే రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా, 24 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్లు 8.6 కోట్ల మందికి భోజనం అందించాయని తెలిపారు. ఐదేళ్లపాటు గుంతలు కూడా పూడ్చలేని వైసీపీ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

# నా బూత్ నా బాధ్యత'

(మొదటి పేజి (తరువాయి)



క్యాడర్‌లో మరింత ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని నింపింది.తెలంగాణ సమాచారం
సభా మధ్యన ఏర్పాటు చేసిన ర్యాంపు పై నుంచి హాల్‌లోకి ప్రవేశించిన కేటీఆర్ అభిమానులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ వచ్చారు. ర్యాంపు పై నడుస్తూనే ప్రసంగించారు. శిక్షణ కార్యక్రమం ముగింపులో సుమారు రెండు గంటల పాటు కార్యకర్తలతో ఫొటోలు, సెల్ఫీలు దిగడంతో క్యాడర్‌లో మరింత జోష్ పెరిగింది. కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని రహదారులు ఫ్లెక్సీలు, కటౌట్‌లతో నిండిపోయాయి. నాయకులు పోటీ పడి మరీ కేటీఆర్‌కు స్వాగత బ్యానర్లు, కటౌట్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు వక్తల ప్రసంగాలు నడిచాయి.మధ్యాహ్నం భోజనం తర్వాత కేటీఆర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, దాసోజు శ్రవణ్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య, బేవరేజస్ కార్పొరేటర్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నాయకుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, అప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాద వ్ అన్నారు. పదవులు రాగానే మారిపోతే ప్రజలు మనల్ని మార్చేస్తారన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో శాశ్వతంగా ఉండే పార్టీ అన్నారు. తెలంగాణను సాధించి, బంగారు తెలంగాణను నిర్మించిన పార్టీ అన్నారు
. అలాంటి పార్టీలో కార్యకర్తగా, నాయకుడిగా ఉండడం గర్వకార ణమన్నారు. గతంలో ఎల్బీనగర్ ఎలా ఉండేది, బీఆర్ఎస్ పాలనలో ఎల్బీనగర్‌ను ఎలా అభివృద్ధి చేశామన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.

## భగీరథ్ ఫోన్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు

హైదరాబాద్/ కుషాయిగూడ, మే 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో జ్యుడీషియల్ కస్టడీకి వచ్చిన బండి సాయి భగీరథ్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలు అధికారులు సాధారణ ఖైదీలతోనే ఉంచారు. ఎలాంటి ప్రత్యేక సదుపాయాలూ కల్పించకుండా.. విచారణ ఖైదీలు ఉండే బ్యారక్‌నే ఆయనకు కేటాయించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌కు కోర్టు రెండు వారాలు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు శనివారం అర్ధరాత్రి తర్వాత రెండు గంటల సమయంలో భగీరథ్‌ను చర్లపల్లి జైలుకు తీసుకువెళ్లారు. జైలు అధికారులు దాదాపు గంటపాటు ఆయనకు సాధారణ వైద్య పరీక్షలు, ఇతర ఫార్మాలిటీలు పూర్తి చేశారు. తర్వాత నేరుగా విచారణ ఖైదీలు ఉండే బ్యారక్‌కు తరలించారు. భగీరథ్‌కు ఎలాంటి 'ప్రత్యేక' సదుపాయాలు కల్పించలేదని చర్లపల్లి జైలు అధికారులు తెలిపారు. అయితే భగీరథ్‌ను ఉంచిన బ్యారక్‌లోని విచారణ ఖైదీలు కాకుండా ఇతర ఖైదీలెవరూ అటువైపు వెళ్లకుండా ఏర్పాటు చేశారని, జైళ్లశాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారని సమాచారం. ఇక జైలులో ఖైదీలకు రోజువారీగా ఇచ్చే అల్పాహారం తీసుకోలేదని, ఆదివారం పెట్టే మాంసాహార భోజనాన్ని తినలేదని సమాచారం. జైలు క్యాంటీన్ నుంచి తెప్పించుకున్న పాలు, బ్రెడ్డు తిని సరిపెట్టుకున్నట్టు తెలిసింది. కాగా, భగీరథ్ కేసులో దర్యాప్తు, సేకరించిన ఆధారాలు, నిందితుడి నుంచి తెలుసుకోవాల్సిన అంశాలు, సేకరించాల్సిన ఆధారాలపై సిట్ అధికారి రితిరాజ్, ఇతర ఉన్నతాధికారులు ఆదివారం సమీక్షించారు.భగీరథ్ నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌ను సాంకేతిక ఆధారాల కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు పంపించాలని నిర్ణయించారు. బాధిత బాలిక తల్లి వాంగ్మూలం నమోదు సమయంలో న్యాయస్థానంలో అందచేసిన సాక్ష్యాధారాలను కూడా ఎఫ్ఎ?సఎల్‌కు పంపిస్తున్నామని ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇక బండి భగీరథ్‌ను పది రోజుల పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టులో పిటిషన్ వేయనున్నారు. దీనిపై కసరత్తు జరుగుతోందని, 19న కోర్టులో కస్టడీ పిటిషన్ వేసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు తెలిపారు. భగీరథ్ అరెస్టు, రిమాండ్ హడావుడిగా జరిగిన నేపథ్యంలో.. ఆయన నుంచి అవసరమైన వివరాలు సేకరించకపోయామని, కస్టడీలోకి తీసుకుని విచారిస్తే కీలక వివరాలు, ఆధారాలు లభించే అవకాశం ఉందని వివరించారు.
బాధితురాలు ఫిర్యాదులో ఆరోపణలు చేసిన ప్రదేశాలకు నిందితుడిని తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ సైతం చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్న మాజీ జర్నలిస్టు సంగప్ప, కేంద్రమంత్రి బండి సంజయ్ నుంచీ దర్యాప్తు అధికారులు వాంగ్మూలాలు సేకరించే అవకాశం ఉందని సమాచారం.

## "ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) చేపట్టేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే..

హైదరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): "ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) చేపట్టేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే.. వారిపైనా సీఎంకు నమ్మకం లేదు. వారికీ మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. ఒక వర్గాన్ని రెచ్చగొడుతున్నారు. ఇటీవల ఓ ముస్లిం సమ్మేళనంలో పాల్గొన్న సీఎం... ముస్లింల ఓట్లు తొలగించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించడం సిగ్గుచేటు. సొంత ప్రభుత్వ అధికారులనే ఆయన అవమానించారు.. కించపరిచారు" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలిసో తెలియకో కొంత మందికి రెండు, మూడు చోట్ల ఓట్లున్నాయని, వాటిని తొలగించడమే సర్ ఉద్దేశమని వివరించారు. సర్ ప్రక్రియ అమలులో ఎక్కడ కుట్ర జరిగిందో రేవంత్, కేటీఆర్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అక్రమంగా ఉంటున్న ప్రతీ రోహింగ్యా ఓటును వెతికి తొలగించాల్సిందేనని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా అమలు చేయకపోవడంతో కొందరు రైతులను బ్యాంకులు డీఫాల్టర్లుగా చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ధాన్యం ఎందుకు కొనడం లేదంటే.. ఏ మంత్రీ సమాధానం చెప్పడం లేదన్నారు. కాగా, పెట్రోల్ ధరలు పెంచడం అప్రజాస్వామికం అంటున్న సీఎం రేవంత్.. వ్యాట్ తగ్గించి ప్రజలకు ఎందుకు ఉపశమనం కలిగించడం లేదని నిలదీశారు. కాగా, బండి భగీరథ్ ఇప్పటికే పోలీసులకు సరెండర్ అయ్యారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కేసును రాష్ట్ర పోలీసులే దర్యాప్తు చేస్తున్నారని, ఇందులో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బూమ్‌తో ప్రపంచమంతా సెమీకండక్టర్లు,

సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని తెరిచింది. సాధారణ సంబంధాలను అనేక రంగాల్లో వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లింది' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. తన పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లోని ప్రధాన కంపెనీల సీఈవోలతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు.
ఈ సమావేశంలో దాదాపు 300మంది సీఈవోలు పాల్గొన్నారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని మోదీ ఆహ్వానించారు. నెదర్లాండ్స్ పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ ఆదివారం స్వీడన్ చేరుకున్నారు. కాగా, డచ్ ప్రధాన రాబ్ జెట్టెన్‌తో కలిసి ప్రఖ్యాత జలాశయం అఫ్‌స్లుట్‌డెక్ డ్యామ్‌ను మోదీ సందర్శించారు. నీటి నిర్వహణలో ఈ డ్యామ్ ప్రపంచంలోనే ఒక అద్భుతంగా పేరుగాంచింది. ఇది 32 కిలోమీటర్ల పొడవైన డ్యామ్ కమ్ కాజ్‌వే. దీనిని 1932లో నిర్మించారు. ఈ డ్యామ్ ఉత్తర సముద్రాన్ని(వాడెన్ సీ), ఇస్సెల్‌మీర్ మంచినీటి సరస్సును వేరు చేస్తుంది. 90 ఏళ్లుగా వరదల నుంచి నెదర్లాండ్స్‌లోని చాలా భూభాగాన్ని ఈ డ్యామ్ కాపాడుతోంది. సముద్రం మధ్యలో ఈ కాజ్‌వేను 300 ఫీట్ల వెడల్పుతో నిర్మించారు.

## ఎప్‌సెట్-2026 ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తా

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్-2026 ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగంలో 3, 4.. అగ్రికల్చర్‌లో 6, 7, 9 ర్యాంకులను ఏపీ అభ్యర్థులు సాధించారు. కాగా, టా పర్లలో ఎక్కువ మంది అబ్బాయిలు ఉండగా, మొత్తం ఫలితాల్లో అమ్మాయి లు పైచేయి సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకుల్లో 8.. అగ్రికల్చర్, ఫార్మసీలో మొదటి 10 ర్యాంకుల్లో 7 అబ్బాయిలకే దక్కాయి. మొత్తంగా చూస్తే ఇంజనీరింగ్ విభాగంలో అమ్మాయిలు 73.72 శాతం అర్హత సాధించగా, అబ్బాయిలు 73.10 శాతం అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అమ్మాయిలు 86.76 శాతం, అబ్బాయిలు 84.70 శాతం అర్హత సాధించారు. మొత్తంగా ఇంజనీరింగ్ విభాగంలో 73.36 శాతం, అగ్రికల్చర్‌లో 86.27 శాతం అర్హత సాధించారు. ఎప్‌సెట్ ఫలితాలను ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ సలహాదారు కంచర్ల కేశవరావు విడుదల చేశారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 84,954 మంది హాజరయ్యారు

## రాష్ట్రంలో పొగాకు రైతుల సమస్యలపైలేఖలు



అమరావతి, మే 17 రాష్ట్రంలో పొగాకు రైతుల సమస్యలపై కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయుష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు ఆదివారం లేఖలు రాశారు. రాష్ట్రంలోని వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి సిగరెట్లపై సవరించిన పన్నుల విధానంవల్ల పొగాకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. 'గతేడాది వేలంలో కిలో పొగాకు ప్రారంభ ధర రూ.280 ఉంటే ప్రస్తుత ఏడాది రూ.250కి పడిపోయింది. పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకోవడంతో రైతులకు నష్టం జరుగుతోంది. అంతర్జాతీయంగా ఏర్పడిన భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎగుమతిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో దాదాపు 43 వేల మంది రైతులతోపాటు, దీనిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడింది' అని లేఖలో పేర్కొన్నారు.

రొయ్యల ఎగుమతుల్లో సంక్షోభాన్ని నివారించాలి

ఏపీలో ఆక్వా రైతులు, రొయ్యల ఎగుమతుల సంక్షోభంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయ్ను?షగోయల్‌కు సీఎం చంద్రబాబు మరో లేఖ రాశారు. రొయ్యల ఎగుమతులపై అమెరికా విధిస్తున్న 50శాతం సుంకంతో భారత ఎగుమతులపై 60శాతం పన్ను భారం పడుతోందన్నారు. ప్రస్తుతం ఏపీ నుంచి రూ.25వేల కోట్ల ఎగుమతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోని 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30లక్షలపైగా కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశీయ మార్కెట్‌లోనూ ఆక్వా ఉత్పత్తుల ధరలు 20-25శాతం మేర పడిపోయాయని సీఎం వివరించారు. ఏపీలో ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు కోసం ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.100కోట్ల కార్పస్ ఫండ్ మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మరో లేఖ రాశారు. ఏపీలో అదనపు రీజనల్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు.

## గురుకుల విద్యార్థులకు మంత్రి అడ్లూరి శుభాకాంక్షలు



హైదరాబాద్, మే 17 : తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి ముఖ్రమ్ అహ్మద్ సత్తాచాటాడు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో స్టేట్ మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీ విద్యార్థులతో పోటీపడి, వారికి దీటుగా స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ సాధించడం గమనార్హం. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కు చెందిన ముఖ్రమ్ 5వ తరగతిలోనే గోషామహల్ బాలుర-1 మైనారిటీ గురుకుల పాఠశాలలో చేరాడు. ఇంటర్ పూర్తిచేసి 2026 ఎప్‌సెట్ పరీక్ష రాసిన ముఖ్రమ్ ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 38.83, జువాలజీలో 36.92, బోటనీలో 34.41 మార్కుల చొప్పున మొత్తం 150.16 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచాడు.
గురుకులాలు నిరుపేదల ఆశాదీపాలు..
ఈ సందర్భంగా ముఖ్రమ్ అహ్మద్‌ను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. మైనారిటీ గురుకుల పాఠశాలలు నిరుపేదల ఆశాదీపాలుగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డాడు. గ్రురుకులాలను ప్రారంభించిన కేసీఆర్‌కు, ముఖ్రమ్ ధన్యవాదాలు తెలిపాడు. పీవీ నర్సింహారావు వెటర్నరీ వర్సిటీలో అడ్మిషన్ తీసుకుంటానని తెలిపాడు. ఎంబీబీఎస్ చదువాలన్న ఆసక్తిలేదని, జంతు ప్రేమికుడినైన తాను బీవీస్సీ వెటర్నరీ సైన్స్‌లో
చేరుతానని చెప్పాడు. భవిష్యత్తులో వెటర్నరీలో రిసెర్చ్ చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నానని, మైనారిటీ గురుకులంలో బోధన, నేర్పించిన క్రమశిక్షణతోనే రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించానని స్పష్టంచేశాడు.

## మోదీ మోసాన్ని ప్రజలు నిలదీయాలి: మస్తాన్‌వలి



అమరావతి, మే 17 మతోన్మాద పిచ్చిలో మునిగితేలుతారో.. ప్రధాని మోదీ చేస్తున్న మోసాన్ని నిలదీస్తారో ప్రజలు తేల్చుకోవాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రధాని దేశ ప్రజలను అవస్థల పాల్జేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని,
దేశ ప్రజలను ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారంటూ చెప్పుకొచ్చిన ఆయన.. ఎన్నికలు అయిపోగానే ధరలను పెంచేశారని విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు భయపడి, రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలు విదేశాలతో కుమ్మక్కయ్యారంటూ విమర్శించే మోదీ.. ట్రంప్‌కెందుకు భయపడుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

# చట్టాలు కాగితాలకే పరిమితం

## వెంకమ్మ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

- **అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరుడు.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ శాఖలు**
- **నిబంధనలు ఉల్లంఘించి అసైన్డ్ భూముల్లో రొయ్యల చెరువుల దందా.. పట్టించుకునే నాథుడే లేడా?**
- **రసాయన వ్యర్థాలతో కలుషితమవుతున్న వెంకమ్మ చెరువు.. 52 మంది మత్స్యకార కుటుంబాల నోట్లో మట్టి**
- **పంట కాలువల ద్వారా విషతుల్యమైన నీరు.. తీవ్ర ఆందోళనలో స్థానిక రైతాంగం**




నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు బిగుతుగా ఉన్నాయని చెప్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రకృతి వనరుల దోపిడీ అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. చెరువులను, భూగర్భ జలాలను సంరక్షించాల్సిన అధికారులే కళ్ళు మూసుకున్నారో.. లేక అక్రమార్కుల లాభాల్లో వాటాలు పంచుకుంటున్నారో తెలియదు కానీ, గత రెండు నెలలుగా జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్థానిక ప్రజలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఖచ్చితంగా రక్షించాల్సిన వెంకమ్మ చెరువు గరిష్ట నీటి మట్టం (ఎఫ్ టి ఎల్) పరిధి, దానికి ఆనుకుని ఉండే బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలు గర్జిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా మట్టిని తోడేస్తూ.. ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అసైన్డ్ భూముల్లో 'రొయ్యల' దందా.. మత్స్యకారుల పొట్టకొడుతున్న అక్రమార్కులు


పేదలకు వ్యవసాయం కోసం ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు ఇక్కడ అక్రమార్కులకు కామధేనువుగా మారాయి. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల్లో కేవలం సాంప్రదాయ సాగు మాత్రమే చేయాలి. కానీ, ఇక్కడ ఇరిగేషన్ మరియు రెవెన్యూ నిబంధనలను పాతరేస్తూ, వెంకమ్మ చెరువు బఫర్ జోన్‌ను సైతం ఆక్రమించి భారీ ఎత్తున రొయ్యల చెరువులు (ఆక్వా కల్చర్) ఏర్పాటు చేస్తున్నారు.

ఈ వెంకమ్మ చెరువుకు ఒక సొసైటీ ఉంది. ఇందులో 52 మంది మత్స్యకార సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత చేప పిల్లలను ఈ చెరువులో వేసి, వాటిని పెంచుకుంటూ ఆ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే, పక్కనే వెలిసిన అక్రమ రొయ్యల చెరువుల నిర్వాహకులు వదులుతున్న ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు, కలుషిత నీరు నేరుగా వెంకమ్మ చెరువులోకి వచ్చి చేరుతోంది.

"రసాయన వ్యర్థాల ధాటికి చెరువులోని నీరంతా కలుషితమై, చేపలు గుంపులు గుంపులుగా చనిపోతున్నాయి. మా కళ్ళ ముందే మా జీవనోపాధి గంగపాలు అవుతుంటే ఏం చేయాలో పాలుపోవడం లేదు" అని మత్స్యకార సొసైటీ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పంట కాలువల్లో 'విషం'.. రైతన్నల ఆవేదన

ఈ దందా కేవలం మత్స్యకారులకే కాదు, స్థానిక రైతాంగానికి సైతం శాపంగా మారింది. వెంకమ్మ చెరువు నుండి పంట కాలువల ద్వారా వెళ్లే నీరంతా







ఈ రసాయనాల వల్ల పూర్తిగా విషతుల్యంగా మారుతోంది. ఈ కలుషిత నీరు పొలాలకు మళ్లడం వల్ల పంటలు దెబ్బతినడమే కాకుండా, భూమి నిస్సారంగా మారిపోయే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల తాగునీటికి కూడా ఈ నీరు పనికిరాకుండా పోయింది.వాల్టా (నీరు, భూమి, వృక్షాల పరిరక్షణ) చట్టం ప్రకారం ఎఫ్‌టిఎల్ పరిధిలో భూమి స్వరూపాన్ని మార్చడం, జలవనరులను కలుషితం చేయడం తీవ్రమైన నేరమైనప్పటికీ, ఇక్కడ మాత్రం అక్రమార్కులదే రాజ్యంగా సాగుతోంది.

రెండు నెలలుగా ఫిర్యాదులు.. అయినా శూన్యం

ఈ అక్రమ తవ్వకాలు, రొయ్యల చెరువుల ఏర్పాటు, మరియు చేపల మరణాలపై స్థానికులు, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు గత రెండు నెలలుగా ఇరిగేషన్ శాఖ అధికారులకు, మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు మరియు స్థానిక తహశీల్దార్ కి రాతపూర్వకంగా, మౌఖికంగా పదే పదే మొరపెట్టుకున్నారు. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కానీ, అటు ఇరిగేషన్ అధికారులు గానీ, ఇటు మైనింగ్ అధికారులు గానీ కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఎమ్మార్వోకి, ఇరిగేషన్ ఏఈ మరియు టిఈలకు కబురు పంపినా 'చూద్దాం.. చేద్దాం' అనే ధోరణి తప్ప క్షేత్రస్థాయిలో తవ్వకాలు ఆపిన దాఖలాలు లేవు. అధికారుల ఈ సుదీర్ఘ మౌనం అక్రమార్కులకు కొండంత అండగా మారింది. దీనికి తగ్గట్టు ఈ మధ్యకాలంలో తెలంగాణ ప్రభుత్వం రైతు పొలాలకు సారవంతమైన చెరువుల మట్టిని తోలుకోవడానికి అనుమతిలిస్తే ఈ రొయ్యల చెరువుల వ్యాపారులకు




మరింత అవకాశం లభ్యమయింది. ఏకంగా వెంకమ్మ చెరువులోని పగలు రాత్రి తేడా లేకుండా జెసిబి లతో తవ్వేసి ఈ రొయ్యల చెరువులకు కట్టలుగా పోస్తున్నారు. మరొకసారి అధికారులకు తెలియజేసిన పట్టింపే లేదు. కనీసం

ఉన్నతాధికారులు స్పందించేనా?

స్థానిక యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసిన ఈ వ్యవహారంలో ఇక జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మైనింగ్ అధికారి (డి ఎం ఓ) తక్షణమే జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 52 మంది మత్స్యకార కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని, అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న వాహనాలను సీజ్ చేసి, చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిని ధ్వంసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రకృతి ఇచ్చిన మంచినీటి వనరులు, పేద ప్రజల బతుకులు అక్రమార్కుల చేతిలో అంతమైపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు.

# ఎండమూరి లేఔట్ నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు



కుత్బుల్లాపూర్, నవతరం: మహదేవపురం డివిజన్ ఎండమూరి లేఔట్‌లో నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా సుమన్ రెడ్డి, చైర్మన్‌గా వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్లేశం, కోశాధికారులుగా అకెళ్ళ శ్రీనివాస్, గోవింద్, వైస్ ప్రెసిడెంట్‌గా రవి సజన్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా శివానంద్ మాడపాటి, వీరబాబు, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చందు, రమేష్ రెడ్డి, కృష్ణ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా భీమా రెడ్డి, రవి, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, పెద్దలు, మాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ, కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్ల సమస్యలను త్వరితగతిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# జి జి హెచ్ లో ముగ్గురికి షోకాజ్ నోటీసులు



గుంటూరు మే 17 గుంటూరు జీజీహెచ్లో రోగికి చికిత్స చేసిన పరికరాలను వారి సహాయకులతోనే శుభ్రం చేయించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపిన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి రమణ తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన హెడ్ నర్స్ కె. పద్మావతి,స్టాఫ్ నర్స్ కె. అంజనిదేవి,ఎఫ్ఎన్వో ఎస్. బీబీజాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఘటనపై 24 గంటల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని,లేకపోతే చర్యలు తప్పవన్నారు.

మారు వేషంలో సూపరింటెండెంట్ తనిఖీ

జీజీహెచ్ సేవలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ ప్రక్షాళన చర్యలు చేపట్టారు.ఆసుపత్రిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఆయన అర్ధరాత్రి మారువేషంలో వార్డులను ఆకస్మికంగా పరిశీలించారు.సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు,లోపాలను స్వయంగా గమనించారు.విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# త్రాగునీటి ఎద్దడి గ్రామాలపై దృష్టి సారించిన అధికారులు



వినుకొండ మే 17


వేసవిలో బొల్లాపల్లి మండలంలోని త్రాగునీటి ఎద్దడి గ్రామాల పై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వం జిల్లా కు రూ.50 లక్షల నిధులు కేటాయించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం గ్రామీణ తాగునీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ వెనుక బడిన బొల్లాపల్లి మండలంలో పర్యటించారు. ప్రధానంగా రేమిడిచర్ల, గుమ్మనంపాడు, గంగుపల్లి తండా, బోడిపాలెం తండాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ గ్రామాలకు, తండా లకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే గ్రామాల్లో తొలుత స్థానిక సంస్థల్లో ఉన్న నిధులను త్రాగునీటి అవసరాలకు వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పరిశీలించిన గ్రామాలకు త్వరలో టాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని ఈ ఈ చంద్ర శేఖర్ తెలిపారు . ఈ ఈ వెంట డి ఈ ఈ కుమార్ రాజు, ఎ ఈ ఆకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కండ్రిక లో మద్యం సరఫరా ను అడ్డుకున్న మహిళలు..



వినుకొండ మే 17 బొల్లాపల్లి మండలంలో ఇష్టానుసారంగా గ్రామాల్లో బెల్టు షాపులు అక్రమంగా నడుస్తున్నాయి. గత పది రోజులుగా కండ్రిక గ్రామానికి మద్యం సరఫరా చేయవద్దని మహిళలు చెబుతున్నప్పటికీ మద్యం షాపుల యజమానులు పట్టించుకోకుండా ప్రైవేటు వాహనంలో పంపుతున్నారు. ఎప్పటిలాగే శనివారం కూడా మద్యం సీసాలు సరఫరా చేసే వాహనం రావడంతో మహిళలు ఆగ్రహించారు. దీంతో మద్యం సరఫరా చేసే వ్యక్తులతో ఘర్షణ పడ్డారు. మద్యం సీసాలను రోడ్డు పై పడవేశారు. ఇదే సమయంలో గ్రామంలోని కొందరు ఈ సంఘటన ను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో నియోజకవర్గం లో ఈ సంఘటన చర్చనీయాంశం అయింది.

# పెద్ది' ట్రైలర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం







మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్దిపై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని సృష్టించింది. విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అంశం పెద్ది ట్రైలర్. ఈ ట్రైలర్ విడుదల కోసం సినీ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సమయంలో చిత్రబృందం మరో భారీ అప్డేట్ ఇచ్చింది. ఇప్పటికే ముంబైలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన మేకర్స్, తాజాగా ఈ ఈవెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించారు.

00:15/01:00

ఈ సందర్భంగా రామ్ చరణ్ స్వయంగా ఓ ప్రత్యేక గ్లింప్స్ ద్వారా అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. "ఇప్పటివరకు మీరు పాటలు, గ్లింప్స్ చూశారు.. ఇక ఇప్పుడు అసలు బ్లాస్ట్ చూడబోతున్నారు" అంటూ అభిమానుల్లో ఆసక్తిని పెంచేలా రామ్ చరణ్ సందేశం ఇచ్చారు. ఈ మాటలతో సోషల్ మీడియాలో పెద్ది ట్రైలర్‌పై చర్చలు మరింత పెరిగిపోయాయి. ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్ వేదికగా ఈ గ్రాండ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో అభిమానులు, సినీ ప్రముఖులు పాల్గొనే అవకాశమున్న ఈ ఈవెంట్‌పై ఇప్పుడు ప్రత్యేక ఆసక్తి నెలకొంది. స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో గ్రామీణ నేపథ్యంలో కనిపించిన చరణ్ లుక్

# నెవర్ బిఫోర్ యాక్షన్?

అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ

చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే




అగ్ర హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ గప్‌చుప్‌గా ముంబైలో షూటింగ్‌ని కానిచ్చేస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రాకా' చిత్రం పానిండియా స్థాయిలో రూపొందుతున్న విషయం తెలిసిందే. దీపికా పదుకోన్ కథానాయిక. మరికొందరు హీరోయిన్లు సైతం ఈ సినిమాలో కనిపించబోతున్నట్టు వినికిడి. వచ్చే ఏడాది సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్‌ని ప్రస్తుతం అట్లీ తెరకెక్కిస్తున్నట్టు సమాచారం.

హాలీవుడ్ స్థాయిలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆయన ప్లాన్ చేశారట. కథ రీత్యా ఎగురుతున్న ఫ్లైట్‌లో ఈ పోరాట సన్నివేశాలుంటాయట. ఈ క్రేజీ యాక్షన్ సీక్వెన్స్ కోసం నిర్మాతలు భారీగానే ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. ఈ సినిమాలోని ప్రతి యాక్షన్ సీక్వెన్స్ నెవ్వర్ బిఫోర్ అనేలా ఉంటాయని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

ఇంటర్వెల్ ఎపిసోడ్ అయితే సినిమాకే హైలైట్ అట. అట్లీ సినిమాల్లో అంతర్లీనంగా సందేశం ఉండటం సహజం. ఈ సినిమాలో కూడా ఓ అద్భుతమైన సందేశం ఉంటుందని తెలిసింది. సాయి

## । వెంకటేశ్ -- త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్ ..




టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్-దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వే గాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండను న్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమా చారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకు లకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృం దం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

## టాలీవుడ్‌లో సరికొత్త మైథలాజికల్ థ్రిల్లర్..

సనాతన ధర్మంలో దాగివున్న రహస్యాల ఆధారంగా రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల'. శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రధారి. మణి తెల్లగూటి దర్శకుడు. రాధిక, శ్రీనివాస్ నిర్మాతలు. ఈ నెల 29న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రపంచమంతా చీకటిగా మారిన సమయంలో వెలుగులా ఉద్భవించిన శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం.

00:00/01:00

ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. ఆధునిక సాంకేతికతతో, హై క్వాలిటీ వీఎఫ్ఎక్స్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: పవన్ చెన్న, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సమర్పణ: చాగంటి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ.






### చీకటిలో వెలుగులా ఉద్భవించిన శక్తి

భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలు, విస్మయం కలిగించే అంశాల నేపథ్యంలో తెరకెక్కిన సరికొత్త మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల'. గ్లామరస్ బ్యూటీ శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం మే 29న ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమైంది. చాగంటి ప్రొడక్షన్ వారి సమర్పణలో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. వైవిధ్యభరితమైన కథాంశంతో పాటు హై-క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ (ఎఖీశ) ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

ఆకట్టుకుంటున్న 'త్రికాల' కథాంశం

ప్రపంచం మొత్తం చీకటి మయమై, సందిగ్ధంలో పడినప్పుడు.. ఆ చీకటిని చీల్చుకుంటూ వెలుగుగా అవతరించే ఒక దివ్య శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. మన సనాతన ధర్మంలోని కొన్ని ఆసక్తికరమైన నిజాల్లను, ఆధునిక థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి దర్శకుడు మణి తెల్లగూటి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఇటీవల కాలంలో భక్తి, మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో 'త్రికాల' విజయంపై చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.

భారీ తారాగణం -- పవర్‌ఫుల్ పాత్రలుఈ సినిమాలో శ్రద్ధాదాస్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో, కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. 'మాస్టర్' ఫేమ్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ సినిమాకు ప్రత్యేక హైలైట్‌గా నిలవనున్నాయి. విలనిజంతో మెప్పించే నటుడు అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో నటించారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com